

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





శుక్రవారం, జూలై 31, 2026 పేజీలు :9


### భారీ వర్షాలపై జిల్లా యంత్రాంగం

# అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- జిల్లాలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు
-- అధికారులకు కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు



**మహబూబ్‌నగర్, జూలై 30**
**( ప్రజా జ్యోతి బ్యూరో ):**
రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, అధికారులు ఎవరూ సెలవులపై వెళ్లకుండా అందుబాటులో




### ప్రత్యామ్నాయ పంటల సాగుతో

# నష్టాలు నివారించండి

- రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి
- అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



### నర్వ మండలం జాతీయ స్థాయిలో

# ఆదర్శంగా నిలవాలి

యాంకీలో కంటైనర్ అంగన్ వాడీ టకేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్.



# పంటల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



# వర్షాలపై అప్రమత్తం




- అధికారులంతా హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలి
- ప్రజలకు వెంటనే సహాయం అందించాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు

# భారీ వర్షాలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

ఉండాలని సూచించారు. ప్రతి జిల్లాలో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, ఇరిగేషన్ ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, రహదారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్లు, భవనాలను గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పాము, తేలు కాట్లకు అవసరమైన మందులను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వినియోగించేందుకు సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లవద్దని ఆదేశించారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు హెడ్‌క్వార్టర్లలోనే అందుబాటులో ఉండాలని, ఎవరూ సెలవులపై వెళ్లరాదని స్పష్టం చేశారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో 24 గంటల ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితులు, వర్షాలు, వరదల వల్ల ఎదురయ్యే సమస్యలను తెలియజేయడానికి 08542-241165 నంబర్‌ను అందుబాటులో ఉంచామని చెప్పారు. అధికారులు, ప్రజలు ఎలాంటి అత్యవసర పరిస్థితులైనా వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. రహదారులు, కల్వర్టులపై వరద నీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలగకుండా ఆర్అండ్‌బీ, పోలీసు శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోయిల్‌సాగర్ సహా రిజర్వాయర్ల పరిసర ప్రాంతాల్లో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించిన కలెక్టర్, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అక్కడి ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. అలాగే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని, తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ వెంకట్ రెడ్డి, సీపీఓ కె. రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, ఆర్అండ్‌బీ ఈఈ దేశ్య నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఎ. శ్రీనివాసులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నర్వ మండలం జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలవాలి

నారాయణ పేట జిల్లా నర్వ మండలం జాతీయ స్థాయిలో ఆదర్శ మండలంగా నిలవాలని, ఇక్కడ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు దేశవ్యాప్తంగాగుర్తింపు పొందేలా మన అందరం కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు.

గురువారం నారాయణ పేట జిల్లా నర్వ మండలం(యాస్పరేషన్ బ్లాక్) లోని యాంకీ గ్రామంలో నూతన కంటైనర్ అంగన్ వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచి కల్యాణి తో కలిసి ఆమె ప్రారంభించారు. కేంద్రంలో సరస్వతి మాత చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రంలో ఎంత మంది చిన్నారులు ఉన్నారని?.అందులో శ్యామ్ మ్యామ్ చిన్నారులు ఎంత మంది ఉన్నారని అంగన్ వాడీ టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్ర ఆవరణలో మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామంలోని ప్రతి చిన్నారి తప్పనిసరిగా విద్యను అభ్యసించాలనీ, ఒక్క విద్యార్థి కూడా చదువు మానేయకుండా చూడడం మనందరి బాధ్యత అని తెలిపారు.

చాలా సంవత్సరాలుగా ప్రారంభించాలని భావించిన ఈ అంగన్‌వాడీ కేంద్రం ఈరోజు ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉందని కలెక్టర్ తెలిపారు.ఈ కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా, పరిశుభ్రంగా ఉపయోగించుకోవాలన్నారు. ఇది సాధారణ భవనం కాకుండా కంటైనర్ మోడల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం అని, అందరూ బాధ్యతతో సంరక్షించాలని ఆమె తెలిపారు.గ్రామంలోని మరో ప్రాంతంలో కూడా అంగన్‌వాడీ కేంద్రం అవసరం ఉంటే, తప్పకుండా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. నర్వ మండలానికి (ఏబీపీ) కింద ప్రభుత్వం ప్రత్యేకంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని,

నర్వ మండలంలోని సర్పంచ్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ప్రస్తుతం నర్వ మండలంలో యాస్పరేషన్ బ్లాక్ కింద అనేక భవనాల నిర్మాణాలకు ఆమోదాలు ఇవ్వడం జరిగిందని, ఎన్ఆర్ఈజీఎస్ ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణాలకు కూడా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ పనులను త్వరగా పూర్తి చేస్తే, బిల్లులు కూడా వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ, అధికారులు, సర్పంచ్‌లకు ఆమె సూచించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులలో పత్తి, వరి వంటి సంప్రదాయ పంటలకు బదులుగా కందులు, పెసర్లు వంటి స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఈ సందర్భంగా ఆమె రైతులకు సూచించారు. దీనివల్ల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు మెరుగైన ఫలితాలు పొందే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. అంతకు ముందు డీ డబ్ల్యు ఓ/ డిపివో, డీఆర్డీవో, తహసిల్దార్, ఎంపిడివో, సిడిపివో లను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, డీఆర్డీవో/ డిపివో వెంకట్ రాములు, తహసిల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, సిడిపివో, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో నష్టాలు నివారించండి

**నాగర్ కర్నూల్ జూలై 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్‌కర్నూల్ జిల్లాలో నెలకొంటున్న ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అధిక నీటి అవసరం ఉన్న వరి పంట సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ రైతులకు సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని, గ్రామస్థాయిలో ప్రతి రైతుకు ఈ విషయంపై స్పష్టమైన అవగాహన కల్పించాలని, వర్షాభావ పరిస్థితుల్లో వరి సాగు చేస్తే రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూడాల్సి వస్తుందని స్పష్టం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గురువారం నాగర్‌కర్నూల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సర్వసభ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, వ్యవసాయం, గ్రామాభివృద్ధి, తాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు, పంచాయతీల ఆర్థిక నిర్వహణ, భూగర్భ జలాల సంరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.ఈ మండల స్థాయి సర్వసర సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదుకాకపోవడంతో పాటు రానున్న రోజుల్లో కూడా వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు సంప్రదాయంగా సాగు చేసే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి పంటల ఎంపిక, సాగు విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సబ్సిడీలు, సాంకేతిక సహాయం, విత్తనాల పంపిణీ వంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ తెలిపారు. రైతులు సమయానికి సరైన నిర్ణయం తీసుకుంటే నష్టాలను నివారించడంతో పాటు ఆదాయాన్ని కూడా పెంచుకునే అవకాశం ఉంటుందని, జిల్లాలోని ప్రాజెక్టుల్లో ఇంకా ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేవని, శ్రీశైలం జలాశయానికి కూడా పూర్తిస్థాయిలో నీటి ప్రవాహం ఆశించిన స్థాయిలో జరగడం లేదని కలెక్టర్ వివరించారు. నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున భవిష్యత్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని రైతులకు తెలియజేయాలని సూచించారు. గ్రామ సభలు, రైతు సమావేశాలు, అవగాహన కార్యక్రమాల ద్వారా ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలెక్టర్ సర్పంచులు, అధికారులకు సూచించారు...కూరగాయల సాగు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలు, ఇతర స్వల్పకాలిక పంటలను ప్రోత్సహించాలని, ఇవి తక్కువ నీటితో మంచి దిగుబడులు ఇచ్చే అవకాశం ఉందని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జలసిరి కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ, సమర్థ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు.భూగర్భ జలాలను విచక్షణారహితంగా వినియోగిస్తే భవిష్యత్తులో తాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. అందువల్ల భూగర్భ జలాలపై ఆధారపడి అధిక నీటి అవసరం ఉన్న వరి సాగును పూర్తిగా నివారించాలని సూచించారు. ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించడమే ప్రస్తుతం అత్యవసరమని అన్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టే చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతలు, రీచార్జ్ నిర్మాణాలు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయిలో పనిచేసే సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని, గ్రామ సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలు కాకుండా శాశ్వత పరిష్కారాలు చూపే దిశగా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ఆరోగ్యం విద్య ఉపాధి వంటి అంశాలపై సర్పంచులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

ఈ మండల స్థాయి సర్వసభ సమావేశంలో నాగర్‌కర్నూల్ ఆర్డీఓ అర్చన, ఎంపీడీవో చెన్నమ్మ, ఎంఈఓ కురుమయ్య, వ్యవసాయ, ఉద్యానవన, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పంటల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

గద్వాల,జూలై 30(ప్రజా జ్యోతి ప్రతినిధి):వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఉపరితల వాతావరణ మార్పుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నప్పటికీ,ఎల్‌నినో ప్రభావం కారణంగా ఆగస్టు,సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారని తెలిపారు.ఈ నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు.వరి సాగు చేపట్టే రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని,బోర్లు,బావులు లేదా ఇతర నీటి వనరుల ద్వారా పంట కాలమంతా తగినంత నీటి లభ్యత ఉన్నవారు మాత్రమే వరి సాగు చేయాలని సూచించారు.నీటి వనరులు పరిమితంగా ఉన్న రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాలను నివారించవచ్చని తెలిపారు.రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పంట కుంటలను నిర్మించుకోవాలని,వర్షాలు తగ్గిన సమయంలో వాటిలో నిల్వ చేసిన నీటిని పంటలకు వినియోగించుకోవచ్చని సూచించారు.జిల్లాలో కూరగాయల సాగుతో పాటు ఆయిల్ పామ్ తోటల విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ,వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు,సూచనలను అనుసరించి పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని జిల్లా కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు.

17

# వర్షాలపై అప్రమత్తం

వనపర్తి ప్రతినిధి, జూలై 30 (ప్రజాజ్యోతి): జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల పరిస్థితులపై గురువారం హైదరాబాద్ నుంచి సీఎస్ సంజయ్ జాజు, రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వనపర్తి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ భారీ వర్షాల దృష్ట్యా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అధికారులు తమ కేంద్ర కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల సమయంలో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తుందని తెలిపారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలోని తహసీల్దార్లు తమ మండల కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు సవరణ డిజిటలైజేషన్‌పై సమావేశం

**-- ఓటరు నమోదు ప్రక్రియలో రాజకీయ పార్టీల పాత్ర కీలకం**
**ఓటరు నమోదు -- సవరణలపై అవగాహన కల్పించాలి**
**-- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్ జులై 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**
గురువారం నాగర్‌కర్నూలు జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధ్యక్షతన ప్రత్యేక ఓటరు సవరణ డిజిటలైజేషన్ ప్రక్రియపై అదనపు కలెక్టర్ చెన్నయ్య తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ప్రక్రియ అని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయడంతో పాటు అనర్హుల పేర్లను తొలగించే ప్రక్రియ కొనసాగుతోందని, డిజిటలైజేషన్ ద్వారా ఓటరు జాబితాలో పారదర్శకత పెరగడంతో పాటు సేవలు మరింత వేగవంతం అవుతాయని వివరించారు.ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడం వల్ల ఎలాంటి నష్టం ఉండదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఎప్పుడైనా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువకుడు, యువతి తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని, అలాగే ఓటరు వివరాల్లో మార్పులు, సవరణలు, చిరునామా మార్పులు వంటి అంశాలను సంబంధిత దరఖాస్తుల ద్వారా సులభంగా చేసుకోవచ్చని చెప్పారు.
సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించారు. గ్రామసభలో తీర్మానం చేసిన అనంతరమే ఓటర్ల తొలగింపు ప్రక్రియను ప్రకటించాలని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామస్థాయిలో ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా వ్యవహరిస్తే అపోహలకు తావు ఉండదని అభిప్రాయపడ్డారు.అలాగే వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన కుటుంబాలకు సంబంధించిన ఓటరు నమోదు, ధ్రువీకరణ ప్రక్రియ నెమ్మదిగా జరుగుతోందని పేర్కొంటూ, అలాంటి కుటుంబాలపై బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) ప్రత్యేక దృష్టి సారించి వారి వివరాలను సకాలంలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల సూచనలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.బీఎల్‌వోలతో నేరుగా చర్చించడం ద్వారా ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్‌ఐఆర్) డిజిటలైజేషన్ ప్రక్రియపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై సూచనలు ఇవ్వవచ్చని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకుడు బాలకృష్ణ, బీఆర్ఎస్ నాయకుడు నర్సింహ, బీజేపీ నాయకుడు నాగేందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు ఎం.డి. హసద్‌తో పాటు ఎన్నికల శాఖ అధికారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్**


నాగర్ కర్నూల్ జులై 30 (ప్రజాజ్యోతి జిల్లా ప్రతినిధి)
రాష్ట్రంలో పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు, విపత్తు నిర్వహణపై జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు (సీపీలు), జిల్లా ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం సాయంత్రం హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ....., రాష్ట్రంలో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని జిల్లాల అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. వర్షాల ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అవసరమైతే ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, వాగులు, కాలువలు, రిజర్వాయర్ల నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రమాద సూచనలు కనిపించిన వెంటనే అప్రమత్త చర్యలు చేపట్టాలని సూచించారు.
వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, రాకపోకలకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో తక్షణమే పునరుద్ధరణ పనులు చేపట్టాలని, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అత్యవసర సేవలు 24 గంటలూ అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని ఆదేశించారు.
జిల్లా యంత్రాంగం, పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన యంత్ర సామగ్రి, సహాయక బృందాలు, పడవలు, రక్షణ పరికరాలు సిద్ధంగా ఉంచాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు జారీ చేస్తుందని, ప్రజలు కూడా అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ జిల్లాలోని వర్షపాత పరిస్థితులు, ముందస్తు జాగ్రత్తలు, రైతులకు అందిస్తున్న సహాయ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సమగ్రంగా వివరించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....... నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతంతో పోలిస్తే 38 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. అయితే గత రెండు రోజులుగా జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తుండటంతో జిల్లా యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేసినట్లు చెప్పారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వైద్య, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వివరించారు.
అలాగే జిల్లాలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల, గ్రామ స్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలు, వాటి సాగు విధానాలు, సాంకేతిక సూచనలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.
అదేవిధంగా జిల్లాలోని జిల్లాలో వర్షాల పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలను మరింత వేగవంతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు.
వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు**



**నాగర్ కర్నూల్ : 30 జులై (ప్రజా జ్యోతి)**
వర్షాలు ప్రారంభమైన దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ముఖ్యంగా వాహనదారులు తమ వా హనాలు సరైన కండిషన్లో ఉండేలా చూసుకోవాలని,ఇండికేటర్స్ ఉపయోగిస్తూ వాహనాలు నడపాలని, లోతట్టు ప్రాంతాలకు వెళ్ళరాదని, విద్యుత్ స్థంబాల వద్ద,విద్యుత్ పరికరాలవద్ద అప్రపత్తంగా ఉండాలన్నారు.

## జూరాలకు పోటెత్తిన వరద

**-12 గేట్లు ఎత్తివేసిన అధికారులు**



**నాగర్ కర్నూల్ : జులై 30 (ప్రజా జ్యోతి)**
ఎగువ నుంచి వస్తున్న భారీ వరదతో జూరాల జలాశయం కళకళలాడుతుంది.ప్రాజెక్టు లోకి భారీగా నీరు చేరుతుండడంతో అధికారులుఅప్రమత్తమయ్యారు.రిజర్వాయర్ భద్రతను దృష్టిలో ఉంచుకొని బుధవారం పది గేట్లను ఎత్తివేసిన అధికారులు గురువారం మరో రెండు గేట్లున్న ఎత్తివేసి దిగువ శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి విడుదల చేస్తున్నారు.ఈ సీజన్ లో స్పెల్వే గేట్లుఎత్తివేయడం ఇదే మొదటిసారి.కృష్ణానది ద్వారా వస్తున్న వరదఉధృతి జూరాల వైపునకు దూసుకు వస్తుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా పెరుగుతుంది.విద్యుత్ ఉత్పత్తి ద్వారా 27,347 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. మత్స్యకారులు చేపలవేటకు వెళ్ళవద్దని లోతట్టు ప్రాంతాలప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## హజ్ యాత్రకు 19 మంది ఎంపిక

**-హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ఫరీద్ అహ్మద్**



**నాగర్ కర్నూల్ : జులై 30 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూల్ జిల్లా నుంచి 19 మంది 2027 హజ్ యాత్రకు ఎంపికైనట్లు జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు షేఖ్ ఫరీద్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం హైదరాబాద్ లోని స్టేట్ వక్ఫ్ బోర్డు కార్యాలయంలోని స్టేట్ హజ్ సొసైటీ భవనంలో లక్కీ డ్రా ద్వారా ఈ ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. నాగర్ కర్నూల్ నియోజకవర్గం నుంచి 4 గురు,కల్వకుర్తి నుంచి 11,అచ్చంపేట నుంచి 4 గురు మొత్తం 19 మంది పవిత్ర హజ్ యాత్రకు ఎంపిక అయ్యారని ఈ హజ్ యాత్రకుఎంపికైన నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో సంప్రదించి తదుపరి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే విధంగా కమిటీసభ్యులు అందుబాటులో ఉంటారని,జిల్లా హజ్ సొసైటీ సభ్యులు 2027 పవిత్ర హజ్ యాత్రకు ఎంపికైన వారిని అభినందించారు.

# చెలిమి కార్యక్రమంలో మెహేంది పోటీలు ఘనంగా నిర్వహణ

**మల్దకల్,జూలై 30(ప్రజా జ్యోతి):**
జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మల్దకల్‌లో చెలిమి కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థుల కోసం వినూత్న పరిచయ కార్యక్రమం,డ్రాయింగ్ పోటీలతో పాటు విద్యార్థినుల కోసం మెహేంది డిజైన్ పోటీలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి జి.సురేష్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థినుల్లో సృజనాత్మకత,ఆత్మవిశ్వాసం,కళాత్మక నైపుణ్యాలు,పరస్పర సహకార భావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.మెహేంది పోటీల్లో విద్యార్థినులు సంప్రదాయ,ఆధునిక శైలుల్లో ఆకర్షణీయమైన డిజైన్లను రూపొందించి తమ ప్రతిభను చాటుకున్నారు.న్యాయనిర్ణేతలు డిజైన్ అందం,సృజనాత్మకత, పరిశుభ్రత,సమయపాలన తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఉత్తమ ప్రతిభ కనబరిచిన



విద్యార్థినులను విజేతలుగా ఎంపిక చేశారు.అనంతరం ఉత్తమ మెహేంది డిజైన్లు రూపొందించిన విద్యార్థినులకు ప్రత్యేక బహుమతులు అందజేసి అభినందించారు.మండల విద్యాధికారి జి.సురేష్,ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి విజేతలను సత్కరించి,భవిష్యత్తులోనూ ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,ఉపాధ్యాయినులు, విద్యార్థులు,విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.విద్యార్థినులు రూపొందించిన మెహేంది డిజైన్లు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరి ప్రశంసలు అందుకున్నాయి.

# భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో 24 గంటల ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**మహబూబ్‌నగర్, జూలై 30( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు.భారీ వర్షాలు లేదా వరదల కారణంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజలు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 08542-241165ను సంప్రదించి సహాయం పొందవచ్చని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
కంట్రోల్ రూమ్ మూడు షిఫ్టుల్లో 24 గంటల పాటు నిరంతరం పనిచేస్తుందని, విధుల్లో ఉన్న సిబ్బంది ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమాచారం స్వీకరించి సంబంధిత శాఖలకు చేరవేసి తక్షణ చర్యలు తీసుకునేలా సమన్వయం చేస్తారని తెలిపారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా విజ్ఞప్తి చేశారు.

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ ,**

**నర్వ జూలై 30 ప్రజా జ్యోతి**
ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను, సంబంధిత అధికారులు త్వరతగతిన పూర్తి చేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్, ఉపాధ్యక్షులు శరణప్ప లు తెలిపారు, గురువారం నర్వ మండల కేంద్రం నాలుగవ వార్డులో ఇటీవల నిర్మించిన. సీసీ డ్రైనేజీ పనులను గ్రామ సర్పంచ్ హనుమంత్ రెడ్డి తో పాటు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు శరణప్ప, లు పరిశీలించారు, ఈ సందర్భంగా సంబంధిత గుత్తేదారుతో మాట్లాడుతూ చేసే పనులు పదికాలాలపాటు, చెక్కుచెదరకుండా ఉండాలని నాణ్యతతో పనులు చేయాలని సూచించారు, ప్రస్తుతం నర్వ గ్రామములో ఇంతవరకు 15 లక్షలతో పదవ వార్డులో సీసీ రోడ్డు పనులు జరిగాయన్నారు, 8 లక్షల తో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి కావడం జరిగిందన్నారు, ప్రస్తుతం 20 లక్షల నిధులతో ఎస్సీ కాలనీ నాలుగో వార్డ్ ఐదవ వార్డులో పనులు జరుగుతున్నాయని జరుగుతున్న పనులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా వార్డు సభ్యులు, గ్రామస్తులు సహకరించాలని తెలిపారు, ప్రస్తుతం మంత్రిగారి సహకారంతో గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవాలంటే అందరూ కలిసికట్టుగా ఉండి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు హనుమంతు, నాయకులు గడ్డం నరసింహ, హమాలి యూనియన్ అధ్యక్షులు మన్యం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# పాము కాటుకి విద్యార్థి మృతి

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) జూలై 30:**



జోగులాంబ గద్వాల జిల్లాఅయిజ మండలం వెంకటాపూర్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.8వ,తరగతి చదువుతున్న కే.తిరుమలేష్ (14) రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటేసింది.అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ తిరుమలేష్ మృతి చెందాడు.సరైన సమయానికి వైద్యులు లేకపోవడంతో సరైన వైద్యం అందుబాటులో లేకపోవడమే తిరుమలేష్ మరణానికి కారణమని తల్లిదండ్రులు గ్రామస్తులు తెలిపారు.

## 14 ఏళ్ల బాలికలందరికీ హెచ్‌పీవీ టీకాలు తప్పనిసరి

మల్దకల్,జూలై 30(ప్రజా జ్యోతి):14 సంవత్సరాల వయస్సు గల బాలికలందరికీ హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాలు తప్పనిసరిగా వేయించాలని రాష్ట్ర టీకాల తనిఖీ బృందం సభ్యులు డేవిడ్ దమార్,డా.పృథ్వీరాజ్ సూచించారు.ఈ టీకా ద్వారా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార (సర్వైకల్) క్యాన్సర్ నుంచి బాలికలను రక్షించవచ్చని వారు తెలిపారు.జోగులాంబ గద్వాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా.సంధ్య కిరణ్ నాయకత్వంలో గురువారం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించిన హెచ్‌పీవీ టీకాకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర బృందం సందర్శించి పరిశీలించింది.ఈ సందర్భంగా జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి మహమ్మద్ అస్గర్ అలీ మాట్లాడుతూ,జిల్లాలో 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకాకరణ కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.మల్దకల్ మండలంలో మొత్తం 602 మంది అర్హులైన బాలికలు ఉండగా, ఇప్పటివరకు 250 మందికి హెచ్‌పీవీ టీకాలు అందించామని చెప్పారు.మిగిలిన అర్హులైన బాలికలందరికీ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా టీకాలు పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీకాల తనిఖీ బృందం సభ్యులు,వైద్యాధికారులు,ఇన్‌చార్జి డిఈఎంఓ హీరియా నాయక్,ఎస్‌వో తిరుమల్ రెడ్డి,డీపీఎంఎం నరేందర్ బాబు,డీపీహెచ్‌ఎన్‌వో వరలక్ష్మి,వీసీసీఎం శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీధర్,పీహెచ్‌ఎన్ సత్యమ్మ,హెల్త్ అసిస్టెంట్ దేవన్న,ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## విద్యార్థుల సమస్యల పై.. ఉద్యమిస్తున్న యుఎస్ఎఫ్ లో చేరండి

**నాగర్ కర్నూల్ జూలై 30 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )**
విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న యు ఎస్ ఎఫ్ లో చేరాలని జిల్లా అధ్యక్షుడు ఎండి సయ్యద్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎండి సయ్యద్ మాట్లాడుతూ యు ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో అచ్చంపేట పట్టణ కేంద్రంలో వివిధ కళాశాలల్లో సభ్యత్వాల నమోదు కార్యక్రమం చేయడం జరిగింది విద్యార్థుల సమస్యలు తెలుసుకొని విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం యుఎస్ఎఫ్ఐ ముందుండి కొట్లాడుతుందని వారు అన్నారు విద్యార్థుల సభ్యత్వాలు నమోదు చేస్తూ. విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటూ యుఎస్ఎఫ్ ఐ లో చేరండి అని మీ యొక్క సమస్యను పరిష్కరించుకోండి అని విద్యార్థులకు తెలియజేస్తూ సభ్యత్వాన్ని నమోదు చేపించడం జరిగింది అనునిత్యం పెండింగ్ స్కాలర్షిప్లపై మరియు హాస్టల్ సమస్యలపై పోరాడుతున్న యుఎస్ఎఫ్ఐ సంఘంలో సభ్యత్వాన్ని నమోదు చేసుకోండి వారు విద్యార్థులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ అచ్చంపేట డివిజన్ కమిటీ సభ్యులు, సోమ్లా నాయక్, పండు ,శ్రీకాంత్, బబులు, మహేశ్వరి, హారిక, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు




## సింగిరెడ్డి నారాయణ జయంతి

**గద్వాల (ప్రజా జ్యోతి) జూలై 30:**
గద్వాల స్థానిక మహారాణి ఆదిలక్ష్మి దేవ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గద్వాల నందు తెలుగు విభాగం వారి ఆధ్వర్యంలో డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ,విశ్వంభర అనే కావ్యానికి రెండవ జ్ఞానపీఠ అవార్డుగ్రహీతగా,తెలుగు సాహిత్య కీర్తిని దేశస్థాయికి తీసుకుని వెళ్లిన వ్యక్తిగా ఆయన రాసిన రచనలు,బిరుదులు బాల్యం విద్యాభ్యాసము, అవార్డులు,సినిమా గేయాలు,తదితర అంశాల పైన సమగ్ర అంశాలను విద్యార్థులకు తెలియజేశారు.తెలుగు విభాగ అధిపతి ఎంహెచ్ నాగభూషణం మాట్లాడుతూ,సినారె వ్రాసిన విశ్వంభర రచన గురించి పేర్కొంటూ మానవుని జీవిత ఆవిర్భావంనుండి నేటి వరకు జీవన పరిణామ క్రమాన్ని సినారె చెప్పిన విధానాన్ని కవిత రూపంలో విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే చంద్రమోహన్,కోఆర్డినేటర్ ఏ రాధిక,తెలుగు అధ్యాపకులు ఎస్ శంకర్,వెంకటేశ్వర్లు, కళాశాల సూపరింటెండెంట్ జి రమేష్,తదితర అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.



# జిల్లాలో కీలక ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

## : కలెక్టర్ ఖుష్బూ గుప్తా




**మహబూబ్‌నగర్, జూలై 30( ప్రజా జ్యోతి బ్యూరో ):** జిల్లాలో అమలవుతున్న కీలక అభివృద్ధి, పారిశ్రామిక ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో భారత్‌మాల జాతీయ రహదారి, రైల్వే లైన్ డబ్లింగ్, టీజీఐఐసీ బ్రహ్మోస్ క్షిపణి తయారీ పారిశ్రామిక పార్కు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ (ఎంజీకేఎల్‌ఐఎస్), ఉదండపూర్ ఆర్ అండ్ ఆర్ ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిని ఆమె సమీక్షించారు. భారత్‌మాల జాతీయ రహదారి ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అవార్డులు పూర్తయిన భూయజమానులకు పరిహారం చెల్లింపులు, మ్యుటేషన్ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత సమావేశంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై తీసుకున్న చర్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని, సేకరించిన భూములకు సంబంధించిన పరిహారాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని సూచించారు. వివాదాస్పద భూముల సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టు భూసేకరణలో పెండింగ్‌లో ఉన్న అవార్డులు, విచారణలు, ఇతర ప్రక్రియలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. భూయజమానుల అభ్యంతరాలు ఉన్న ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని చెప్పారు. రైల్వే అధికారుల సమన్వయ లోపంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, ప్రతి సమావేశానికి వేర్వేరు అధికారులు హాజరవడం వల్ల కమ్యూనికేషన్ లోపాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ప్రాజెక్టుకు వారంలో ఒకటి లేదా రెండు రోజులు కేటాయించి సంబంధిత అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదని, శాఖల మధ్య సమన్వయం మరింత పెరగాలని అన్నారు. దేవరకద్ర మండలంలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమ కోసం భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టీజీఐఐసీ, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి, ఆక్రమణలు లేని సుమారు 63 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే పూర్తి చేసి అడ్వాన్స్ పొజిషన్ ద్వారా వెంటనే అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ (ఎంజీకేఎల్‌ఐఎస్) ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, అవార్డుల జారీ, పనుల పురోగతిని సమీక్షించారు. ఇప్పటివరకు జారీ చేసిన డిక్లరేషన్లు, పెండింగ్ అవార్డుల వివరాలను తెలుసుకుని, రైతులకు పరిహారం సకాలంలో అందేలా పెండింగ్ ప్రక్రియలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు పనులకు ఆటంకంగా ఉన్న భూసేకరణ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీలతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. మిడ్జిల్ మండలంలో భూసేకరణకు సంబంధించి గ్రామస్థులతో చర్చలు జరిపి, గ్రామపంచాయతీ తీర్మానాలు, అవసరమైన అంగీకార పత్రాలు సేకరించి సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టులకు అవసరమైన భూముల విషయంలో ఎలాంటి అపోహలు, వివాదాలు లేకుండా భూ రికార్డులు, సర్వే వివరాలు, దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రతి అంశాన్ని స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. తదుపరి ఉదండపూర్ రిజర్వాయర్ పునరావాసం మరియు పునర్నిర్మాణం పనులపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, పునరావాస కాలనీల్లో ప్లాట్ల కేటాయింపు, తాగునీటి పైప్‌లైన్లు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్ అండ్ ఆర్ అవార్డులు, పరిహారం చెల్లింపులను కూడా త్వరగా పూర్తి చేసి నిర్వాసితులకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సర్వే నంబర్ల వారీగా పెండింగ్ భూసేకరణ, అవార్డులు, పరిహారం చెల్లింపులు, ఇతర సమస్యలపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రతి సమస్యకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, ఆర్డీఓ నవీన్, జాతీయ రహదారుల శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు, మండల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# 'మేరా యువ భారత్-- నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్, జూలై 30( ప్రజా జ్యోతి బ్యూరో ):** యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా చైతన్యపరిచి, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "మేరా యువ భారత్ -- నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, యువతే దేశ భవిష్యత్తుకు బలమైన శక్తి అని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. "సే నో టూ డ్రగ్స్ -- ఎస్ టు లైఫ్ " అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ ప్రచారం ద్వారా యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా యువత కోసం జానపద గీతాలు, నృత్యం, నుక్కడ్ నాటక్/మైమ్, పెయింటింగ్, డిబేట్ ఉ ఎలోక్యూషన్, షార్ట్ ఫిల్మ్/రీల్స్, స్లోగన్ రచన, స్లామ్ పోయెట్రీ వంటి మొత్తం ఎనిమిది విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విజేతలకు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొని, మత్తు పదార్థాల నిర్మూలనలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ జానకి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా యువజన అధికారి తోటా నాయక్, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు అనిల్ కుమార్, రాజేందర్ గౌడ్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.




# పంట కుంటల పనులు నాణ్యతతో చేపట్టాలి

## :అదనపు కలెక్టర్ బి.నర్సింగ్‌రావు

గద్వాల,జూలై 30(ప్రజా జ్యోతి ప్రతినిధి):మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పంట కుంటల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.నర్సింగ్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం గద్వాల మండలంలోని బసల్‌చెరువు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన పంట కుంటలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు.నిర్మాణ నాణ్యత,నిర్వహణ విధానం,రైతు టలకు అందుతున్న ప్రయోజనాలను క్షుణ్ణంగా పరిశీలించి,పనులు నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు రైతులకు దీర్ఘకా లిక ప్రయోజనం చేకూరే విధంగా అమలు చేయాలని ఆదేశించారు.అనంతరం పుటాన్‌పల్లి సమీపంలోని గిరిజన సంక్షేమ పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, వసతి,భోజన సౌకర్యాలు,పరిశుభ్రత,తాగునీటి సదుపాయం,పారిశు ధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సౌకర్యాలను మెరుగుప రచాలని సంబంధిత అధికారులకు సూచించా రు.ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సంక్షేమ పథకాలు,సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందేలా అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపట్టాలని ఆయన ఆదేశించారు. పాఠశాల నిర్వహణలో నాణ్యత కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది,పాఠశాల సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# విజన్ ఇండియా--2047 సదస్సు పాలమూరు యూనివర్సిటీలోనే నిర్వహించాలి


## : పాలమూరు పునర్నిర్మాణ ఫోరం

**మహబూబ్‌నగర్, జూలై 30 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** విజన్ ఇండియా--2047 సదస్సును పాలమూరు యూనివర్సిటీలోనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ పాలమూరు పునర్నిర్మాణ ఫోరం ఆధ్వర్యంలో గురువారం పాలమూరు ప్రముఖులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలకు ఉద్దేశించి వినతిపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ, పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించాల్సిన సదస్సును ఇతర జిల్లాకు తరలించే ప్రయత్నాలు జిల్లాకు తీవ్ర అన్యాయం చేసే చర్యగా అభివర్ణించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి జిల్లా 12 మంది ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని సదస్సును పాలమూరు యూనివర్సిటీలోనే నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. విజన్ ఇండియా--2047 వంటి ప్రతిష్ఠాత్మక సదస్సు మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్లు, విద్యావేత్తలకు పాలమూరు చరిత్ర, సంస్కృతి, అభివృద్ధి అవకాశాలు పరిచయం అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇది జిల్లా ప్రతిష్టను జాతీయ స్థాయిలో మరింత పెంచుతుందని పేర్కొన్నారు. జిల్లా గౌరవాన్ని కాపాడే విషయంలో ప్రజాప్రతినిధులందరూ రాజకీయాలకు అతీతంగా స్పందించి సదస్సు పాలమూరు యూనివర్సిటీలోనే జరిగేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పాలమూరు పునర్నిర్మాణ ఫోరం అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి, రాఘవాచారి, జేపీఎన్‌సీఈ రవికుమార్, ఫరూక్ హుస్సేన్, వామన్ కుమార్, రఫిక్ మైనుద్దీన్, అంజన్న చారి తదితరులు పాల్గొన్నారు.



# ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు గా మ్యాతరి గోపాల్





నర్వ జులై 30 ప్రజా జ్యోతి
నారాయణ పేట్ జిల్లా ఉప సర్పంచుల కార్యవర్గ ఎన్నికల గురువారం జరిగాయి, నారాయణ పేట్ జిల్లా ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు గా మ్యాతరి గోపాల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బోట్ల కార్తీక్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను కాలువాలతో సన్మానించారు, అనంతరం వేదికపై ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఉప సర్పంచులకు గౌరవ వేతనం, అధికారాలు, తగిన గుర్తింపు కల్పించాలని తెలంగాణ ఉప సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ అన్నారు,, గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ఉప సర్పంచులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నప్పటికీ, వారికి తగిన గుర్తింపు, ఆర్థిక భరోసా, అధికారాలు ఇప్పటికీ కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప సర్పంచులకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం మంజూరు చేయాలని, ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల శిలాఫలకాలపై సర్పంచ్ పేరుతో పాటు ఉప సర్పంచ్ పేరును కూడా తప్పనిసరిగా పొందుపరచాలని కోరారు. అలాగే గ్రామ పంచాయతీ తీర్మానాలపై ఉప సర్పంచులకు సంతకం చేసే అధికారాన్ని కల్పించాలని, మండల స్థాయిలో నిర్వహించే సర్వసభ్య సమావేశాలకు ఉప సర్పంచులను అధికారికంగా ఆహ్వానించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల అమలుతో గ్రామ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెరుగుతుందనరు అలాగే ఉప సార్పంచుల ఏ ఆపదలో ఉన్న మీకు ఏ ఇబ్బంది కల్గిన తక్షణమే మీ ముందు ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప అధ్యక్షులు గంధం పురుషోతం, రాష్ట్ర కార్యదర్శి గణేష్, నారాయణ పేట్ జిల్లా ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు , వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దింటి తాయప్ప, గౌరవ అధ్యక్షులుగా ఎలాన్ కోటి చెన్నప్ప,జనరల్ సెక్రెటరీ గా శ్రీనివాస్ రెడ్డి, అధికార ప్రతినిధిగా మాలరాజు, ఉమెన్ ప్రెసిడెంట్ గా శిరీష లను ఏనుకొన్నారు. మక్తల్, నర్వ, మాగనూర్, కృష్ణ, ఉట్కూర్, నారాయణ పేట్, మధుర్, గుండుమాల్, కొత్త పల్లె, ధమారగిద్ద, కోస్గి, జిల్లా లోని 13 మండలల ఉప సర్పంచూలు పాల్గొన్నారు.

## మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు సలహాలు అందించాలి

### కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్‌నగర్, జూలై 30 ( ప్రజా జ్యోతి బ్యూరో ): వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగుపై రైతులకు ఎప్పటికప్పుడు శాస్త్రీయ సూచనలు, సలహాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావం కారణంగా గత రెండు నెలలుగా జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులను ఆరుతడి పంటల సాగు వైపు ప్రోత్సహించినట్లు తెలిపారు. అయితే గత రెండు రోజులుగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని అధికారులకు ఆదేశించారు. వ్యవసాయ అవసరాలకు తగిన విధంగా విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో రైతులు పత్తి, జొన్న, కంది, పెసర, మినుము తదితర పంటలు సాగు చేసినట్లు పేర్కొంటూ, వాతావరణ పరిస్థితులను బట్టి ప్రత్యామ్నాయ పంటల సాగుపై కూడా రైతులను ప్రోత్సహించాలని అన్నారు.
ఆరుతడి పంటల కింద సజ్జలు, కొర్రలు, సామలు వంటి చిరుధాన్యాల సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని, వీటి మార్కెటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. వ్యవసాయ అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండి రైతులకు సాంకేతిక సూచనలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు ఏ సమస్యతో వచ్చినా వెంటనే స్పందించి నాణ్యమైన సలహాలు ఇవ్వాలని, రైతుల్లో విశ్వాసం పెంచేలా పనిచేయాలని సూచించారు. రానున్న రెండు నుంచి మూడు నెలలు వ్యవసాయ రంగానికి అత్యంత కీలకమైనవని పేర్కొన్న కలెక్టర్, వర్షపాతం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైతే ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక (కంటింజెన్సీ ప్లాన్) అమలు చేయాలని ఆదేశించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి, ఎలాంటి కొరత ఉన్నా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు మరింత చురుకుగా పనిచేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని, శాఖ పనితీరుపై వచ్చే ప్రతికూల అంశాలను తీవ్రంగా పరిగణిస్తానని హెచ్చరించారు.
ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి 45 రోజులకు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాలు తప్పనిసరి

### జడ్పీ సీఈఓ వెంకట్ రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 30( ప్రజా జ్యోతి బ్యూరో ): జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని మండల ప్రజా పరిషత్‌లలో ప్రతి 45 రోజులకు ఒకసారి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాలను తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) వెంకట్ రెడ్డి ప్రత్యేక అధికారులను ఆదేశించారు.
పంచాయతీరాజ్ చట్టం--2018 నిబంధనల ప్రకారం నిర్వహించే ఈ సమావేశాలకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, మండల స్థాయి అధికారులు, శాశ్వత ఆహ్వానితులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశాలు ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా నిర్వహించబడేలా ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని, అజెండాలో పొందుపరిచిన అన్ని అంశాలపై సమగ్రంగా చర్చ జరిగేలా చూడాలని పేర్కొన్నారు. అదేవిధంగా సమావేశాల మినిట్స్‌ను సక్రమంగా నమోదు చేసి, ఆమోదించిన తీర్మానాల అమలుపై తదుపరి చర్యలు చేపట్టేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓలు) సమావేశాల నిర్వహణలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.
ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలు కోసం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాలు కీలక వేదికలని పేర్కొన్న జడ్పీ సీఈఓ వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ఆదేశాలను అన్ని మండలాల్లో తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులను కోరారు.

## పూడికతో మూసుకుపోయిన కాలువలు.. మురుగునీటితో ప్రజల అవస్థలు

### - దోమల బెడదపై స్థానికుల ఆందోళన





వనపర్తి, జూలై 30 (ప్రజాజ్యోతి):
వనపర్తి పట్టణంలోని బందారు నగర్‌లో డ్రైనేజీ కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగు నీరు సక్రమంగా వెళ్లక వర్షం కారణంగా రోడ్లపైకి నీరు వచ్చి నిల్వ ఉంటోందని వారు స్థానికులు ఆరోపించారు. దీంతో దోమలు విపరీతంగా పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీరు నిలిచే ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని తొలగించి, డ్రైనేజీ కాలువలను శుభ్రం చేసి నీటి ప్రవాహం సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి రహదారులు నీటితో నిండిపోవడంతో చిన్నారులకు, పాదచారులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ సమస్యపై సమాచారం అందుకున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు వజ్రాల రమేష్ గురువారం బందారు నగర్‌కు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆయన కోరారు. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు చేపట్టాలని వజ్రాల రమేశ్ విజ్ఞప్తి చేశారు.

## క్రిస్టియన్‌పల్లిలోని ఎస్టీ హాస్టల్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్‌నగర్, జూలై 30 ( ప్రజా జ్యోతి బ్యూరో ):
మహబూబ్‌నగర్ పట్టణంలోని క్రిస్టియన్‌పల్లిలో ఉన్న ఎస్టీ హాస్టల్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ గురువారం ఆకస్మికంగా సందర్శించి, అక్కడి వసతులు, నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. తనిఖీ సందర్భంగా హాస్టల్‌లోని విద్యార్థులతో ఆయన నేరుగా మాట్లాడి, వారికి అందిస్తున్న భోజనం నాణ్యత, వసతి సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై పూర్తి దృష్టి సారించి, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. హాస్టల్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పరిశుభ్రత, భద్రత, విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా హాస్టల్ నిర్వహణ ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.



# జాతీయ రహదారుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**- కలెక్టర్ ఖుష్బూ గుప్తా**
**- బాలానగర్ ఫ్లైఓవర్ పనులు ఆగస్టు 15లోగా పూర్తి చేయాలని గడువు -- ఎన్‌హెచ్ఏఐ అధికారులకు హెచ్చరిక**



**మహబూబ్‌నగర్, జూలై 30 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** జిల్లాలో జాతీయ రహదారులపై కొనసాగుతున్న అన్ని రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకితో కలిసి నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆమె రహదారి నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల ఆలస్యం కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటమే కాకుండా రోడ్డు ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణంలో ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, డైవర్షన్లు, రోడ్డు మార్కింగ్‌లు, లైటింగ్, క్రాష్ బ్యారియర్లు తదితర భద్రతా చర్యలను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. మూసాపేట, రాజాపూర్, జడ్చర్ల, పొన్నకల్ జంక్షన్లలో పెండింగ్ సమస్యలను పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలని, అవసరమైతే సంయుక్త తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్ సమస్యలకు ఇంజినీరింగ్ పరమైన పరిష్కారాలు అమలు చేయాలని ఆదేశించారు. బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణం ఆలస్యం కావడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పదేపదే గడువులు పొడిగించడం సరికాదని హెచ్చరిస్తూ, ఆగస్టు 15లోగా అన్ని ప్రాధాన్య పనులు పూర్తి చేయాలని స్పష్టమైన గడువు విధించారు. పనుల పురోగతిపై ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు జియో ట్యాగ్ ఫోటోలతో పాటు పనుల స్థితి, కార్మికుల సంఖ్య, ప్రస్తుత పరిస్థితిపై నివేదిక పంపాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించారు. గడువులోగా పనులు పూర్తి కాకపోతే సంబంధిత అధికారుల పనితీరుపై ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయానికి నివేదిస్తానని హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల వల్ల పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంటూ, మున్సిపల్, పోలీసు, రోడ్లు-భవనాల శాఖ అధికారులు సమన్వయంతో ఆక్రమణలను తొలగించి పాదచారులకు సురక్షితంగా నడిచే వాతావరణం కల్పించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ జానకి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పోలీసు శాఖ సూచించిన భద్రతా చర్యలను సంబంధిత శాఖలు వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధి కోట బాబు, రోడ్లు-భవనాల శాఖ, రవాణా శాఖ, మున్సిపల్ శాఖ, పోలీసు శాఖ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్ ఖుష్బూ గుప్తా**
**ఎస్పీ డి. జానకితో కలిసి పరిస్థితులపై సమీక్ష**




**మహబూబ్‌నగర్, జూలై 30:** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ డి. జానకితో కలిసి జిల్లా స్థాయి అధికారులతో వర్షాల పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. రహదారులు, కల్వర్టులు, వంతెనలు, లోతట్టు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. భారీ వర్షాల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖలు వెంటనే స్పందించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, వాగులు, కాలువల నీటి మట్టాలను ఇరిగేషన్ అధికారులు నిరంతరం పరిశీలించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల్లో దప్పు చాటింపు, మైకుల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అవసరమైతే అక్కడ నివసిస్తున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వెంటనే సహాయం అందించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**-ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రంగా అజ్మీరా**
**-:ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలే లక్ష్యం**



**మహబూబ్‌నగర్, జూలై 30 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** వాతావరణంలో మార్పుల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసు కోవాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. రంగా అజ్మీరా సూచించారు. గురువారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఇంటి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీటిని తప్పనిసరిగా మరిగించి తాగాలని, వండిన ఆహారాన్ని ఎక్కువసేపు నిల్వ ఉంచకుండా వేడిగా చేసుకుని తీసుకోవాలని చెప్పారు. ఈ జాగ్రత్తలు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల నాణ్యమైన బ్రాడ్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే జనరల్ సర్జరీ విభాగంలో వైద్య సేవలు అందిస్తున్నానని, గత ఏడాది కాలంలో 100కు పైగా లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. నూతన ఆస్పత్రి భవనాన్ని సెప్టెంబర్ నెలలో ప్రారంభించేలా అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. కొత్త భవనంలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, న్యూరో సర్జరీ వంటి అత్యవసర సూపర్ స్పెషాలిటీ సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గౌరవ మంత్రి యెన్నం శ్రీనివాస్ రెడ్డి చొరవతో ఆస్పత్రికి రూ.5 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చనున్నట్లు తెలిపారు. ప్రజలకు అత్యాధునిక సదుపాయాలతో కూడిన నాణ్యమైన వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లక్ష్యమని డా. రంగా అజ్మీరా స్పష్టం చేశారు.

# నీటి వృథా నివారణకు ఫారం పండ్లు.. స్థలాలను పరిశీలించిన ఎంపీడీఓ సూర్ణ ఆదర్శ్ గౌడ్



**చిన్నంబావి, జూలై 30 (ప్రజా జ్యోతి)** భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు, రైతుల పొలాల్లో ఫారం పండ్లు నిర్మించాలని చిన్నంబావి ఎంపీడీఓ సూర్ణ ఆదర్శ్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం పెద్దమారూర్ గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా ఫారం పండ్ల నిర్మాణానికి రైతు మౌలాలి భూమిని పరిశీలించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవడం ద్వారా భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని, చిన్న, సన్నకారు రైతులు ఫారం పండ్లు నిర్మించుకుని వర్షపు నీటిని సాగునీటిగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతపగ జయమ్మ--లక్ష్మయ్య, ఏపీఓ ధనుంజయ రాజు, టీఏ స్వామి, ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో రైతులు సాగు చేయాల్సిన ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

**బిబిమండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని**

**వంగూర్ జూలై 30 (ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ లో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొని రైతులను ఉద్దేశించి పాలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. జలసిరి కార్యక్రమం, లిలిఎల్‌నినో (జుశ్రీ చీఆశీ) వాతావరణ పరిస్థితులులి మరియు వాటి ప్రభావం వ్యవసాయంపై ఎలా ఉంటుందనే విషయాలను వివరించారు. వర్షపాతం అనిశ్చితంగా ఉండే పరిస్థితుల్లో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అలాగే, తక్కువ నీటితో సాగు చేయగల లిప్రత్యామ్నాయ పంటలులి అయిన కంది, పెసర, మినుము, నువ్వులు, ఆముదం, జొన్న, సజ్జ తదితర చిరు ధాన్యాలు, అలాగే కూరగాయల పంటలను సాగు చేయడం ద్వారా వర్షాభావ పరిస్థితుల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. నీటి యాజమాన్యంలో భాగంగా ఫారం పాండ్ నిర్మించుకోవడం, ఊట బావులు తీసుకోవడం , బోర్ వెల్ రీచార్జ్ స్ట్రక్చర్ నిర్మించుకోవడం మరియు బిందు, తుంపర్ల సేద్యం గురించి వివరించడం జరిగింది. అదేవిధంగా, గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన లినిగ్రాణి సమితి (చీఱస్త్రతీaఅఱ ఐaఎఱ్‌ఱ)లి యొక్క పాత్ర, విధులు గురించి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా కార్యక్రమాలు నిర్వహించడం, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాల్లో నిగ్రాణి సమితి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.



# మండల ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్సై రామన్ గౌడ్




**చిన్నంబావి, జూలై 30 (ప్రజా జ్యోతి)**
రోడ్డు భద్రత ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని చిన్నంబావి మండల స్థానిక ఎస్సై రామన్ గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వాల్మీకి చౌరస్తాలో వారాంతపు సంత సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, మత్తు పదార్థాల నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రాణాంతకమని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటుబెల్ట్ వినియోగించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రమాదాలు సంభవించి కుటుంబాలు విషాదంలో మునిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్లకు మోటార్ వాహనాలు అప్పగించడం తల్లిదండ్రుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పేర్కొంటూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్, ధూమపానం, మద్యపానానికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. క్షణిక ఆనందం కోసం చెడు అలవాట్లకు బానిసైతే భవిష్యత్తు చీకటిమయం అవుతుందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న సైబర్ మోసాలు, గొలుసు లాక్కెళ్లే ఘటనలు, చోరీల నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, నకిలీ లింకులు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజల భాగస్వామ్యంతో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాల నియంత్రణకు తోడ్పాటుతో పాటు నిందితులను త్వరగా గుర్తించి చట్టం ముందుకు తీసుకురావడం సులభమవుతుందని వివరించారు. ప్రజల సహకారంతోనే నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్న ఎస్సై, పోలీసు శాఖ చేపడుతున్న అవేర్నెస్ ప్రోగ్రాం అవగాహన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, మహేశ్వర్, రవికుమార్, కమలాకర్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు, విద్యుత్, ఆరోగ్యంపై ఎమ్మెల్యే సీరియస్

- రూ. 140 కోట్ల విద్యుత్ పనులు పూర్తి..
మరో రూ. 40 కోట్లకు శ్రీకారం
- మండల సమావేశం.. అధికారులపై ఎమ్మెల్యే ఫైర్!
- డుమ్మా కొట్టిన అధికారులకు మెమోలు
- ఎమ్మెల్యే మేఘా రెడ్డి




**వనపర్తి ప్రతినిధి, జూలై 30 (ప్రజాజ్యోతి):**
మండల సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులపై కఠిన చర్యలు తప్పవని, వెంటనే మెమోలు జారీ చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం గోపాల్పేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, ప్రజా సమస్యల పరిష్కారానికి సర్వసభ్య సమావేశాలు కీలక వేదికలని, వాటిని నిర్లక్ష్యం చేసే అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చివరి లబ్ధిదారుడి వరకు చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. వైద్యశాఖ సమీక్షలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు, వ్యాక్సిన్ల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, 14--15 ఏళ్ల బాలబాలికలకు వ్యాక్సినేషన్‌లో ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న గోపాల్పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్త భవనం నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యాశాఖపై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లులను ప్రస్తుతం సకాలంలో చెల్లిస్తున్నామని, గత ప్రభుత్వ హయాంలో 'మన ఊరు--మన బడి' పనులకు సంబంధించిన సుమారు రూ. 1,800 కోట్ల బిల్లులను విడతల వారీగా చెల్లించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, భూగర్భ జలాల పెంపునకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పూర్తి వివరాలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు గ్రామస్థాయిలో మరింత చురుకుగా పనిచేసి ప్రభుత్వ పథకాలపై పశుపోషకులకు అవగాహన కల్పించాలని సూచించారు. పగటి వేళల్లో వీధిలైట్లు వెలిగించి ప్రజాధనాన్ని వృథా చేసే గ్రామపంచాయతీలపై బాధ్యత నిర్ణయించి అవసరమైతే విద్యుత్ బిల్లుల చెల్లింపులు నిలిపివేయాలని ఎంపీడీవోకు ఆదేశించారు. నియోజకవర్గంలో విద్యుత్ రంగంలో ఇప్పటికే రూ. 140 కోట్ల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ. 40 కోట్ల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇకపై ప్రతి 45 రోజులకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించాలని, సమావేశానికి 15 రోజుల ముందే గత నిర్ణయాల అమలు, పెండింగ్ అంశాల వివరాలను సర్పంచులకు అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వెంకటేష్, వైస్ చైర్మన్ సత్యశీలారెడ్డి, ప్రత్యేక అధికారి సుధీర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రఘు, తహసీల్దార్, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నాగర్ కర్నూల్ నూతన ఎస్సైగా వెంకటరెడ్డి

**నాగర్ కర్నూల్ : జూలై 230 (ప్రజా జ్యోతి)**
నాగర్ కర్నూలు జిల్లా కేంద్ర పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా వెంకటరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించి సిఐ అశోక్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరం పోలీస్ సిబ్బంది, అధికారులు స్వాగతం పలికారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని నూతన ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు.




## గండీడ్ మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణపై బీజేపీ నేతల క్షేత్రస్థాయి పరిశీలన



గండీడ్, ప్రజాజ్యోతి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం గండీడ్ మండలంలోని రుసుంపల్లి, చిన్నవార్వల్, పెద్దవార్వల్, వెన్నచేడు, సల్కర్‌పేట్ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఓటరు నమోదు పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఓటరు నమోదు ఎంత శాతం పూర్తయిందనే విషయాన్ని పరిశీలించి, బూత్ స్థాయిలో నమోదు ప్రక్రియను సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునేలా బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని గండీడ్ మండల బీజేపీ అధ్యక్షుడు కే. విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో బీజేపీ పరిగి అసెంబ్లీ ఎస్ఐఆర్ ఇన్‌చార్జి కేరింత కేశవులు, బీజేపీ నాయకులు ముకుంద్ నాగేశ్వర్, సర్పంచ్ వీరన్న రాములు నరసింహారావు దిగంబర్ రావు కృష్ణయ్య శ్రీనివాస్ రఘు ఎంకప్ప పార్టీ బీఎల్ఏలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గండీడ్ మండల జర్నలిస్టుల సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**గండీడ్, ప్రజాజ్యోతి:**
గండీడ్ మండల జర్నలిస్టుల సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేయాలని నిర్ణయించారు. నూతన కార్యవర్గంలో మండల అధ్యక్షునిగా బోయిన గోపాల్, ప్రధాన కార్యదర్శిగా బంటు అంజనేయులు, ఉపాధ్యక్షులుగా రామకృష్ణారెడ్డి, వెంకటేష్, కార్యదర్శిగా భద్రేశ్వర్ వెంకటేష్, కోశాధికారిగా శంకర్, సలహాదారులుగా శ్రీనివాస్, ఉమామహేష్, యాదగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వృత్తి నైపుణ్యాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. మండలంలోని జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండలంలోని పలువురు సీనియర్ జర్నలిస్టులు, రిపోర్టర్లు, మీడియా ప్రతినిధులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి, వారి పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



# ఎల్‌నినోపై సమగ్ర యాక్షన్ ప్లాన్

- రూ.802.92 కోట్లతో రైతు రక్షణకు కార్యాచరణ
- సీఎంకు నివేదిక అందజేసిన డా. జీ. చిన్నారెడ్డి




**వనపర్తి ప్రతినిధి, జూలై 30 (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు, గ్రామీణాభివృద్ధి రంగాలను పరిరక్షించేందుకు రూపొందించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి సెంటర్‌లో అందజేశారు. ఈ కార్యాచరణ అమలుకు సుమారు రూ.802.92 కోట్ల నిధులు అవసరమని నివేదికలో అంచనా వేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన డాక్టర్ చిన్నారెడ్డి, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి వివిధ శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. నీటి పొదుపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల పంపిణీ, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. జూలై 27 నాటికి రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే సుమారు 30 శాతం లోటు నమోదైందని, జలాశయాలు, భూగర్భ జలాల నిల్వలు తగ్గాయని నివేదిక పేర్కొంది. దీంతో వరికి బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటల సాగును గ్రామాల వారీ ప్రణాళికతో ప్రోత్సహించాలని సూచించింది. ఈ పంటలకు అవసరమైన విత్తనాలను 75 శాతం సబ్సిడీపై అందించాలని సిఫార్సు చేసింది. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులు, ఫార్మ్ పాండ్లు, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్ పనులను విస్తృతంగా చేపట్టాలని నివేదిక పేర్కొంది. అలాగే ఉద్యాన పంటలు, పశుగ్రాస బ్యాంకులు, గ్రామీణ ఉపాధి హామీ పనులు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి భద్రత, రైతులకు వాతావరణ ఆధారిత సాంకేతిక సలహాలు, ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ జోక్యంతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి కీలక సిఫార్సులను ప్రభుత్వం ముందుంచింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని ఖరీఫ్ పంటలను విజయవంతంగా సాగు చేసేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కమిటీ సూచించింది. ఈ కార్యాచరణను వెంటనే అమలు చేస్తే వ్యవసాయ ఉత్పత్తి, రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత, పశుగ్రాస లభ్యత, గ్రామీణ ఉపాధికి గణనీయమైన రక్షణ లభిస్తుందని నివేదిక స్పష్టం చేసింది.

## ఆగస్ట్ 1న ఉమ్మడి జిల్లా వేదికగా జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం

-జన సైనికులు కదం తొక్కి పార్టీ విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయండి
- మఖ్తల్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్




**మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జూలై 30 (ప్రజా జ్యోతి):** ఆగస్టు 1న ఉమ్మడి పాలమూరు జిల్లా వేదికగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పార్లమెంట్ కో ఆర్డినేటర్ మేద రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఎస్ గార్డెన్ జరిగే మహబూబ్ నగర్ పార్లమెంట్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి జిల్లా నాయకులు,మఖ్తల్ నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్ జనసేన పార్టీ నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వేదికగా తొలిసారి నిర్వహించే జనసేన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి తెలంగాణ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని నియోజకవర్గ ఇన్చార్జిలు జనసైనికులు మెగా అభిమానులు పాల్గొననున్నట్లు మణికంఠ గౌడ్ తెలిపారు. పాలమూరు వేదికగా జనసేన పార్టీ సిద్ధాంతాలను, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను తెలంగాణ రాష్ట్రంలో గ్రామ గ్రామాలలోకి తీసుకువెళ్లి ప్రజా సమస్యలపై పోరాడేందుకు సిద్ధమవుతున్న తరుణంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఆగస్టు 1న నిర్వహించే విస్తృతస్థాయి సమావేశంలో ప్రతి జన సైనికుడు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ భవిష్యత్తు కార్యాచరణ పై నియోజకవర్గ ఇన్చార్యులకు, ముఖ్య నాయకులకు ,కార్యకర్తలకు దిశ నిర్దేశం చేయనున్నారని కావున ప్రతి ఒక్కరు పాల్గొని తొలిసారి ఉమ్మడి పాలమూరు జిల్లా వేదికగా నిర్వహించే పార్లమెంటు నియోజకవర్గం జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని మఖ్తల్ నియోజకవర్గ ఇంచార్జ్ మరియు రాష్ట్ర యువజన విభాగం ఆడ్ హాక్ కమిటీ సభ్యుల డాక్టర్ మణికంఠ గౌడ్ జనసేన పార్టీ కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు.

## ఉపాధ్యాయుల కొరతను వెంటనే తీర్చాలి

**కృష్ణా జూలై 30 ( ప్రజా జ్యోతి)** పి ఆర్ టి యు టి యస్ 2026 సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నారాయణపేట జిల్లా అధ్యక్షులు వై. జనార్దన్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పి. నరేందర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వై. జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను ప్రభుత్వం అత్యవసరంగా భర్తీ చేయాలని కోరారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే సి పి ఎస్ రద్దు, పి ఆర్ సి, డి ఏ ల మంజూరు మరియు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పి ఆర్ టి యు టి ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. మండల అధ్యక్షులు దండు శేఖర్, ప్రధాన కార్యదర్శి యం.ఆర్. అజయ్, గౌరవ అధ్యక్షులు యన్. శివరాజ్, అసోసియేట్ అధ్యక్షులు అనిల్ కుమార్, మండల కార్యవర్గ సభ్యులు తిరుమల రావు, చంద్ర శేఖర్, పి శ్రీనివాస్,అర్జున్,పి రాఘవేంద్ర,రామకృష్ణ,రమేష్,అఖిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో సభ్యత్వాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్,కిశోర్ కుమార్,సంతోష్‌ఉపాధ్యాయులు,కుర్మన్న,తిమ్మప్ప,శ్రీనివాస్,నాగరాజు,ఆన ంద,రాజన్న,షాహీన్,టిరేణుక,రేణుకదేవి,రంగారావు,అర్చన,స్వాతి,గీత,నర్సి ములు,ఉషా,ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్,రామకృష్ణ,నరసింహ, ఉపాధ్యాయులు భారతి,రవి కుమార్,అమృత,ఆస్మా,జ్యోతి,కళ్యాణి,రుషిక,సుష్మా,శోభారాణి తదితరులు పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఊట కుంటలు ఏర్పాటు చేసి నీటిని ఒడిసి పట్టాలి

-జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్




**నాగర్ కర్నూల్ : జూలై 30(ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ప్రత్యేకాధి కారి అధ్యక్షతన సర్పంచ్ లకు మరియు మండల్ స్థాయి అధికారుల సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంనాకు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలినివో ప్రభావంతో రైతులు ఆరుతడి పంటలను వేయాలని,ప్రతి గ్రా మంలో జలసిరి పనులు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మాణం,సోక్ పిట్స్,పంట కుంటలు ఏర్పాటు,ప్రతి ఊరికి ఉట కుంట నిర్మాణం చేసి నీటిని వడిసి పట్టాలన్నారు. అనంతరం శాఖల వారిగా రివ్యూ నిర్వహించి గ్రామపంచాయతి లో గ్రామ సభ ఏర్పాటుచేసి ప్రజలకు అవగాహనా కల్పించేందుకు సర్పంచులకు,పంచాయతీ కార్యదర్శు లను ఆదేశించారు.

## వడ్డేపల్లి మండలం రామపురంలో బీజేపీ 'ఒకరోజు బస' కార్యక్రమం

**వడ్డేపల్లి జూలై 30 (ప్రజా జ్యోతి):** వడ్డేపల్లి మండలం రామపురం గ్రామంలోని బూత్ నంబర్--161, బీసీ కాలనీలో వడ్డేపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు బోయ నాగరాజు ఆధ్వర్యంలో గురువారం 'ఒకరోజు బస' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘాల సంజీవరెడ్డి హాజరై బూత్ స్థాయి కార్యకర్తలతో మమేకమయ్యారు. పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలతో పాటు ఎస్ఐఆర్‌కు సంబంధించిన విషయాలను కార్యకర్తలకు వివరించారు. ఎన్నికల జాబితాల్లో మరణించిన వారి పేర్లు,రెండు చోట్ల నమోదైన ఓట్లు,అక్రమంగా ఉన్న ఓట్లు,విదేశీయుల పేర్లను గుర్తించి తొలగించే ప్రక్రియలో బీజేపీ కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఇటీవల పేపర్ లీక్ వ్యవహారంపై కాంగ్రెస్,దాని మిత్రపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. పరీక్షల పారదర్శకత కోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకువస్తే కాంగ్రెస్,దాని మిత్రపక్షాలు వాటిని వ్యతిరేకిస్తూ వాక్‌అవుట్ చేశాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని,మోదీ ప్రభుత్వం విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని,భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటోందని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నాయకులు,కార్యకర్తలు అదే గ్రామంలో రాత్రి బస చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పరశు రాముడు,మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు అయ్యారాజు,వీరేష్,రాఘవేంద్ర తదితర బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

